# మొక్కు

కాంద్రకోట నూకాలమ్మ తీర్థానికి పోయింది సీతాలు. మైదానంలో వంద రూపాయలకి ఓ మేకపోతుని కొని, అమ్మవారి గుళ్లోకి లాక్కుపోయింది. గుడి లోపలి ప్రాకారంలో ప్రదక్షిణ చేసి, అమ్మవారి కాలి మీది పసుపు కుంకుమనింత మేక మొహాన రుద్ది, మేకని అమ్మవారికి తెగ నరకమంది. జాతర పాడుకొన్న కంట్రాక్టరు శోభనాద్రీ, గుమాస్తా రాఘవులూ, సీతాలుకి అసలు విషయం చెప్పారు. అమ్మవారికి జాతరల్లో జంతు బలిని ప్రభుత్వం నిషేధించింది. మొత్తం జాతర పేరు చెప్పి, మొదటి రోజున మాత్రం, అనుమతి తీసుకొచ్చి, ఒక మేకపోతుని బలి వేశారు జంతువుల్ని మొక్కుకొన్న వారు. వాటిచే అమ్మవారికి ప్రదక్షిణ చేయించి గుడి కప్పగిస్తే చాలు.

సీతాలుకి గుండె గుబగుబలాడింది. "ఇదెక్కడి న్యాయం? అమ్మకి మేకపోతుని బలి వేస్తానని మొక్కుకొన్నాను. మొక్కుబడి తీరకపోతే ఆ పాపం ఎలా భరించేది? మీరొప్పుకోక పోతే, నా తమ్ముణ్ణి తీసుకొచ్చి దీని తల నరికి పారించేస్తాను" అన్నది శోభనాద్రితో.

రాఘవులు లౌక్యంగా అన్నాడు: "చూడమ్మా నువ్వు మేకపోతుని తెగవేస్తే ప్రభుత్వం మమ్మల్ని నరికి పారేస్తుంది. నీ ధర్మం నువ్వు నెరవేర్చుకొన్నావ్. మేకని వెయ్యని పాపం నీకెందుకు వస్తుంది? అదంతా ప్రభుత్వానికి పోతుంది. అంచేత మేకని గుడికప్పగించి వెళ్లు"

చుట్టూ జనం గుమిగూడడంతో, సీతాలు మరింత ధైర్యం పుంజుకొని దబాయించడం మొదలుపెట్టింది. "మీ ఎత్తులు నాకు తెలియవనా?! మైదానంలోంచి గుళ్ళోకి, గుళ్ళోంచి మైదానంలోకి మార్చి మార్చి, తిప్పి తిప్పి ఒక్కో జంతువు మీదా జాతర అయ్యేటప్పటికి ఎంత డబ్బు గుంజి పారేస్తారు? ఓసారి నేనమ్మవారికిచ్చిన పోతు మళ్ళీ బయట అడుగు పెట్టడానికి వీల్లేదు!"

"ఏం సొద వచ్చి పడిందిరా?" అని శోభనాద్రి విసుక్కున్నాడు రాఘవులు: చుట్టూ ఉన్న జనాన్నీ, ముక్కుపుటాలెగరేస్తూ నడుం మీద చెయ్యివేసి నిల్చున్న సీతాల్ని చూశాడు. 'జాతర మొదలై వారం రోజులైనా, ఎవరూ ఇలాంటి పేచీ పెట్టలేదు. ఏదో విధంగా ఈ గొడవని తేల్చిపారేయాలి. లేకపోతే మొదటికే మోసం వస్తుంది' అనుకొన్నాడు.

"సరేనమ్మా. నువ్విక్కడే ఉండు. నేను పోలీసు స్టేషన్‌కు పోయి సంగతి చెప్పి, అనుమతి అడుగుతాను. వాళ్లు ఒప్పుకొంటే, సాయంత్రం జనం వెళ్ళిన తర్వాత, మేకని వేసిపారేద్దాం. కాని పోలీసులు ఏదైనా గొడవపెడ్తే దానికి సంజాయిషీ నువ్వే చెప్పుకోవాలి!" అన్నాడు. సీతాలు మాట్లాడలేదు. 'మనకెందుకొచ్చిన గొడవా!' అనుకొంటూ గుమిగూడిన జనం కదిలింది. అందరూ వెళ్ళిన తర్వాత రాఘవులే మళ్లీ అన్నాడు:

"మేం ఏదో బుకాయిస్తున్నామనుకోవద్దు. గుడి బయట జంతు బలిని నిషేధించినట్లు బోర్డు కట్టాం కావలిస్తే వెళ్ళి చూసుకో. నువ్వేదో మేం ఈ జంతువుల మీద లాభాలు గడిస్తున్నామని అనుకొంటున్నావు కాబట్టి. ఓ సంగతి విను. ఒకవేళ మేకని నిజంగా తెగ వేసినా తర్వాత దాన్ని మాంసం దుకాణం వాడికి అమ్మాలి. వాడు నలభై రూపాయలకన్నా యివ్వడు. ఏది ఏమైనా జాతర పాడుకొన్నందుకు, మేం మా డబ్బులు సంపాదించుకోవాలి కదా! అందుకని, నువ్వు మాకు నలభై రూపాయలిచ్చి మేకని పట్టుకుపో. నీ మొక్కుబడి తీరినట్లయిపోతుంది. ఇందులో ఏ పాపమున్నా, అదంతా మాది! తర్వాత మేకని నువ్వు నెత్తి మీద పెట్టుకొని పూజించుకో!"

సీతాలు రాఘవులి మాటల్ని అర్థం చేసుకొంది. వాటిలో కొద్దిగా సబబు లేకపోదని పించింది. అయినా మరో నలభై రూపాయలని తటపటాయించి, మరి మాట్లాడకుండా మేకని యింటికి తోలుకుపోయింది, డబ్బిచ్చి.

అసలు గొడవ అక్కణ్ణుంచే మొదలైంది.

ఇంటికి వెళ్ళిన తర్వాత, చుట్టుపక్కల వాళ్ళందరికీ జరిగింది గర్వంగా చెప్పింది. సీతాలు ఆ రాత్రి మేకని దొడ్లో గుంజకి కట్టి. ఇంత మేత ముందర పడేసి లోపలికి వెళ్లింది. ఊరెళ్ళిన మొగుడు తిరిగి వచ్చింతర్వాత ఏం సంజాయిషీ యివ్వాలా అనుకొంటూ కలత నిద్ర పోయింది.

కట్టిన తాడు బలహీనంగా ఉండడం మూలాన అర్ధరాత్రి దాటిన తర్వాత, మేక తాడు తెంచుకొని అంతంత మాత్రంగా వున్న తాటాకుల దడిలోంచి దారి చేసుకొని, పక్కింటి సూరమ్మ దొడ్లో ప్రవేశించి, పూత పూసిన మొక్కల్నీ, నోటి కందిన పాదుల్నీ, తెల్లవారేసరికి స్వాహా చేసింది. మలిజాము కోడికూతతో బయటకు వచ్చిన సూరమ్మ,

మేకని చూసి అమాంతం పట్టేసి, తాడు పెట్టి కట్టిపారేసింది. అటుపైన మేకని కొడ్తూ, సీతాల్ని, ఆమె వంశం వాళ్లని అందర్నీ తిడ్తూ, శాపనార్థాలు మొదలు పెట్టింది.

సీతాలు, సూరమ్మ అరుపులు విని బయటకు వచ్చి, దడికివతల్నుంచి మాటకు రెండు మాటలూ, తిట్టుకి నాలుగు తిట్లూ లంకించుకోవడంతో, పరగడుపున జరుగుతోన్న భాగవతాన్ని చూడడం కోసం పది మందీ పోగయ్యారు. ఆ సమయంలో సూరమ్మ కొడుకు వెంకటాద్రి యింట్లో లేడు. ఇటు సీతాలు మొగుడూ, ఎదురింట్లోఉన్న సీతాలు తమ్ముడూ కూడా ఊళ్ళో లేకపోవడం మూలాన, పురాణం అంతా ఆడవాళ్ళిద్దరి మధ్యే జరిగింది.

చివరికి, పాడు చేసిన మొక్కలికి నష్టపరిహారంగా పది రూపాయిలిస్తేనే కాని సూరమ్మ, మేకని సీతాలుకి తిరిగి యివ్వలేదు. అందరూ సీతాలు మేకని గురించి చెప్పుకొంటూ, నవ్వుకొంటూ వెళ్ళిపోయారు.

కడుపు దుగ్ధతో ఆ రోజు మధ్యాహ్నం సీతాలు భోజనం చెయ్యలేదు.

క్రితం రోజు రాత్రే పెదరెడ్డిగారి పొలంలో పడుకున్న వెంకటాద్రి, ఆ మధ్యాహ్నం యింటికి భోజనానికి వచ్చినప్పుడు, సూరమ్మ జరిగిందంతా కొడుకుతో చెప్పింది.

"సరేలే. గొడవ తీరిపోయింది కదా. యింక మాట్లాడకుండా వుండడమే మంచిది. అసలే సీతాలు నోరు మంచిది కాదు!" అన్నాడు వెంకటాద్రి. తన తల్లి నోరు కూడా అంతకు తక్కువేమీ కాదని వెంకటాద్రికి తెలుసు.

ఆ రోజు సాయంత్రం అరటిపళ్ళ వాడి కేక విని, పళ్ళు కొందామని వెంకటాద్రి యింటి బయటకు వచ్చాడు. వాడు సీతాలింటి ముందరుండడం చూసి, వెంకటాద్రి అక్కడకు వెళ్ళాడు. అరుగు మీద నిల్చుని అరటిపళ్ళు బేరమాడుతున్న సీతాలు వెంకటాద్రిని చూసి కసెక్కిపోయి, "ఒరేయ్ అబ్బీ. ఊరి వాళ్ళందరికీ నా మేకంటే కన్ను కుట్టుగా ఉంది. అడ్డమైనవాళ్ళూ వాళ్ళ పిచ్చి మొక్కల్ని తిందని అన్యాయంగా డబ్బు గుంజారు. వాళ్ల మొక్కల్ని తినే గతేం నా మేకకి పట్టలేదు. దానికి రాజాలాంటి తిండి పెడ్తాను. ఓ డజను అరటిపళ్ళివ్వు!" అంది అరటిపళ్ళవాడితో.

"నీ మేక నీకూ, మా నష్టం మాకూ ముట్టిపోయిన తర్వాత విసుర్లెందుకు? గొడవెందుకు?" అన్నాడు వెంకటాద్రి విసుగ్గా.

"అయ్యొ నా కొడకా! నీ అమ్మ నోరే అనుకొన్నాను కాని, నీ నోరూ అంతేరా! ఇప్పుడు నిన్నేమన్నానని అంత మాటలన్నావు?!" సీతాలు రెచ్చిపోయి అనడంతో, వెంకటాద్రికి తిక్క రేగింది. తిట్ల బాణాలు వదలడంతో, దారిన పొయ్యే నలుగురూ పోగయ్యారు. సూరమ్మ కూడా రంగంలో దూకడంతో, ఆడవాళ్లిద్దరూ జుట్టూ జుట్టూ పట్టుకొన్నారు.

అంతకు కొంచెంసేపు క్రితమే ఊర్నించి తిరిగివచ్చి, విశ్రాంతి తీసుకొంటున్న సీతాలు తమ్ముడు కనకరాజు ఎదురింట్లోంచి వచ్చి, అంతా విని వెంకటాద్రితో మందలింపుగా అన్నాడు. "ఏదో పెద్దది కొడకా అన్నంతమాత్రాన, అంతమాటనొచ్చా?!"

"సర్దుకుపోయిన గోడవని కెలికి, తర్వాత కొడకా' అంటే ఎలా పడేది మావాఁ?" అన్నాడు వెంకటాద్రి ఎగతాళిగా.

కనకరాజు "నేను నీకు మావనంట్రా దొంగనాయాలా?! నా కూతురు మీద కన్నేశావట్రా పీనుగా! ప్రాణాలు తీసేస్తాను" అన్నాడు అరుచుకొంటూ.

"గుమ్మడికాయ దొంగంటే భుజాలు తడుముకొన్నాట్ట నీలాంటి వాడే! అయినా, కాని కూడు తిన్నా కడుపు నిండాలి! ఆ మెల్ల కన్ను మొహం మీద కన్నేయవలసిన అవసరం నాకేమీ లేదు. నీ అప్ప నన్ను కొడకా అంటే, నిన్ను నేను మావాఁ అనకపోతే, మరేం అనాలి?"

వెంకటాద్రి తిరుగు సమాధానం విని కనకరాజు రక్తం వుడికిపోయింది. తమాషా చూస్తున్న ఒకరి చేతిలోంచి కర్ర లాక్కొని, వెంకటాద్రి మీద విరుచుకుపడ్డాడు.

అనుకోకుండా మీద పడిన కనకరాజుని ఆపు చేసుకోలేక పోయాడు వెంకటాద్రి. కనకరాజు వేసిన దెబ్బ భుజం మీద పడ్డంతో దిగువగా వున్న ఎముక విరగడంతో, బాధ భరించలేక, వెంకటాద్రి కిందపడి దొర్లసాగాడు. కనకరాజు చేతిలోంచి కర్ర లాగి పారేశారు జనం. సూరమ్మ సీతాల్ని వదిలి, కొడుకు మీద పడి లబోదిబోమని గుండెలు బాదుకొంది. కనకరాజూ, సీతాలూ లోపలకు జారుకొన్నారు.

ఆ దారమ్మట పోతున్న ఆ వూరి మున్సబు విషయం తెల్సుకొని, కనకరాజంటే కడుపు మంట కొద్దీ పోలీసు స్టేషనుకెళ్ళి రిపోర్టు చేశాడు. పోలీసులొచ్చి దెబ్బతిని బాధ పడ్తున్న వెంకటాద్రి దగ్గర వాఙ్మూలం తీసుకొని, అటుపైన అతగాణ్ణి హాస్పిటల్‌లోనూ, కనకరాజుని జైల్లోనూ పడేశారు. మునసబు ప్రతిపక్షం వాడైన కరణం, ఓ ప్లీడర్ని పెట్టి, కనక రాజుని బెయిల్ మీద విడిపించాడు. తన్ను కొట్టిన నేరానికి, కనకరాజు మీద క్రిమినల్ కేసు పెట్టడానికి వెంకటాద్రి మరో ప్లీడర్ని కుదుర్చుకొన్నాడు.

ఊర్నించి తిరిగి వచ్చిన సీతాలు మొగుడు జరిగిందంతా తెల్సుకొని, "కనీసం ఆడ మేకైతే పాలైనా యిచ్చేది. తద్దినంలా ఈ పోతెందుకు?" అంటూ సీతాలు మీద విరుచుకు పడి, మేకపోతుని ఆదివారం సంతలో నష్టానికి అమ్మిపారేశాడు.

వెంకటాద్రీ, కనకరాజూ, మునసబూ, కరణం, అరటిపళ్ళవాడూ, మరో అరడజను మంది సాక్షులూ, సూరమ్మా, మొగుడితో సహా సీతాలూ, పోలీసు స్టేషన్ చుట్టూ, ప్లీడర్ల చుట్టూ, కోర్టు చుట్టూ తిరగడం మొదలెట్టారు.

'నూకాలమ్మ తల్లీ, నా తమ్ముడు ఈ కేసులో గండం గడిచి బయటపడ్తే మళ్ళీ వచ్చే జాతరకి, నీకు మేకపోతుని తెగవేస్తాను' అని మనసులో మొక్కుకొని చేతులెత్తి నమస్కరించిన సీతాలు వెంటనే లెంపలు గట్టిగా వాయించుకొని, "క్షమించు తల్లీ, పొరపాటై పోయింది. నా తమ్ముడు గండం గడిచి బయటపడ్తే, పది వీశల చలిమిడీ, నాలుగు బిందెల పానకమూ ఇచ్చుకొంటాను" అంది పైకి!

*(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక : 27-1-1978)*